నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పోచారం: విద్యుత్ లైన్ల విస్తరణ పనులు జరుగుతున్నందున మంగళవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోచారం, డాక్టర్స్ కాలనీ, విజయ సాయి ఎన్‌క్లేవ్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు



కీసర: ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం అహ్మద్ గూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 74లో గల ప్రభుత్వ స్థలంలో వెలసిన అక్రమ కట్టడాలను జేసీబీ సహాయంతో కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలను, అసైన్డ్ స్థలాలను అన్యాక్రాంతం చేసే వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

అన్నదానం



కీసర: అన్ని దానాల్లో కెల్ల అన్నదానం గొప్పదని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం అమావాస్య సందర్భంగా నాగారం మున్సిపల్ పరిధిలోని ఆర్‌ఎల్‌నగర్‌లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ కీసర మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బెలిదే రమేష్ గుప్తా, సంఘం నేతలు జూలకంటి అశోక్‌గుప్తా, నాగేష్‌గుప్తా, కౌన్సిలర్ లక్ష్మీ వేణుగోపాల్, కీసర మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రమేష్ గుప్తా, రాజ్‌కుమార్‌గుప్తా, రఘురామ్, జిల్లా ఆంజనేయులు, స్వప్న పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

కీసర: మత్తు పదార్థాలను విక్రయిస్తున్న ఇద్దరు యువకులను మల్కాజ్‌గిరి ఎస్‌ఓటీ, కీసర పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన కరణ్‌సింగ్ రాజ్‌పుత్(19) నిర్మల్‌లోని వీరతేజ రాజస్థానీ దాబాలో పనిచేస్తున్నాడు. ఇతనికి నగరంలోని ఏఎస్‌రావునగర్‌లో రైలింగ్ పని చేసే రాజస్థాన్‌కు చెందిన రాకేశ్ మంజు బార్సిలాల్(26)తో పరిచయం ఉంది. ఇద్దరు కలిసి సోమవారం సాయంత్రం యాద్గార్‌పల్లి చౌరస్తాలో ఆటోలో పాప్పి స్ట్రా అనే మత్తు పదార్థం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న మల్కాజ్‌గిరి ఎస్‌ఓటీ పోలీసులు, కీసర పోలీసుల సాయంతో దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద 2 కిలోల 200 గ్రాముల మత్తు పదార్థంతోపాటు రెండు సెల్‌ఫోన్లు ఒక టాటా ఏసీ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండిళ్లలో చోరీ

ఘట్‌కేసర్: బంధువు ఫంక్షన్‌కు వెళ్లి వచ్చేసరికి ఇళ్లుగుల్ల చేసిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరుశురాం వివరాల ప్రకారం..అవుషాపూర్ గ్రామానికి చెందిన కొట్టి రవీందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు స్థానిక రాక్ ఎన్‌క్లేవ్‌లో జరిగిన బంధువుల ఫంక్షన్‌కు వెళ్లారు. కార్యక్రమం అనంతరం ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండగా బీరువాలోని రూ. 2.1 లక్షలు నగదు, 20 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. అలాగే సమీపంలోని రమావత్ రమేశ్ ఇంట్లో జొరబడి నగదు రూ. 6 వేలు, 15 తులాల వెండి ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలించగా పల్సర్ బైక్‌పై ముగ్గురు వచ్చినట్లు గుర్తించారు.

ఆర్మ్‌డ్ కాలేజీని తరలించొద్దంటూ ఆందోళన

ఘట్‌కేసర్: ప్రిన్సిపాల్ స్వప్రయోజనాల కోసమే బీబీనగర్ మండల పరిధిలోని లక్ష్మీదేవిగూడెం నుంచి ఘట్‌కేసర్ మండల పరిధిలోని అంకుషాపూర్‌నకు తెలంగాణ సాంఘిక సంక్షేమ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ డిగ్రీ కళాశాలను తరలిస్తున్నట్లు ఆరోపిస్తూ విద్యార్థినులు సోమవారం ఆందోళన చేశారు. అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఇప్పటికే 550 మంది విద్యార్థినులు ఉన్నారని, ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ కళాశాలకు చెందిన 350 మంది విద్యార్థినులను ఇక్కడకు తరలిస్తే ఎలా చదువుతారని ప్రశ్నించారు. ప్రిన్సిపాల్‌కు సౌకర్యంగా ఉంటుందని కళాశాలను తరలించారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ కళాశాలను తిరిగి లక్ష్మీదేవిగూడకు పంపాలని డిమాండ్ చేశారు.



యాసంగిలో పంట సాగుకు

రైతులు రెడీ

- 16,413 రైతులకు రూ.110కోట్ల రుణాలు
- జిల్లాలో 13,788 ఎకరాల్లో వరి, 5,968 ఎకరాల్లో ఉద్యానవన, 691 ఎకరాల్లో ఇతర పంటలు
- అందుబాటులో 7,458 క్వింటాళ్ల విత్తనాలు, 4,347 మెట్రిక్ టన్నుల ఎరువులు
- మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ శాఖ సమాయత్తం
- సాగు చేయని భూములకు రైతు భరోసా నిలిపివేతతో 50 శాతం నిధులు ఆదా

సాక్షి,సిటీబ్యూరో: యాసంగిలో మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 19,756 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేసేందుకు రైతులు రెడీ అయ్యారు. ఇందుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను రైతులకు వ్యవసాయ శాఖ అందుబాటులో ఉంచింది. ఆరుతడి పంట సాగుకు తగినట్లుగా ఉద్యానవన పంటలతోపాటు జొన్న, సజ్జ, శనగ, అపరాలను పండించుకునేలా రైతుల్లో అవగాహన కల్పిస్తోంది.

10 మండలాల పరిధిలో..

◆ జిల్లాలోని 10 మండలాల పరిధిలో రైతులు పంటలను సాగు చేస్తారు. ఘట్కేసర్, కీసర, మేడ్చల్, శామీర్‌పేట్, దుండిగల్, మేడిపల్లి మండలాల్లో 13,788 ఎకరాల్లో వరి పంటను సాగు చేయనుండగా, జొన్న, మొక్కజొన్న, శనిగలు, గోధుమ, ఇతర పంటలను 691 ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు సాగు భూమిని సిద్ధం చేశారు. 5,465 ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో 2,657 ఎకరాల్లో కూరగాయ పంటలు, 2,808 ఎకరాల్లో పండ్లు, తీగ జాతి పంటలు, పూతోటలు రైతులు సాగు చేయనున్నారు.

సబ్సిడీ విత్తనాలు..

◆ ప్రతి రైతుకు ఐదు ఎకరాలకు మించకుండా సబ్సిడీ విత్తనాలను సకాలంలో పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో మొత్తంగా 7,458 క్వింటాళ్లకు సంబంధించి వివిధ రకాల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచారు. వీటిలో 4455 క్వింటాళ్ల వరి విత్తనాలు, 2,900 క్వింటాళ్ల మొక్కజొన్న, 52 క్వింటాళ్ల జొన్న విత్తనాలను ఆరు కేంద్రాల ద్వారా సబ్సిడీపై అందజేయనుంది. వ్యవసాయానికి 24గంటల విద్యుత్తు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటోంది.



రైతులకు రూ.110 కోట్ల పంట రుణాలు..

◆ మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో యాసంగిలో 16,413 మంది రైతులకు రూ.110 కోట్ల పంట రుణాలను వివిధ బ్యాంకుల ద్వారా రైతులకు పంపిణీ చేసేందుకు సంబంధిత బ్యాంకులతో వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.

సాగు చేయని భూములకు భరోసా కట్..!

◆ మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 40,960 మంది రైతులకు (పట్టాదారు పాసు పుస్తకాలు) సంబంధించి 77,984 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో ప్రతి ఏటా వానాకాలం సీజన్‌లో 35 వేల ఎకరాలు ,యాసంగిలో దాదాపు 20 వేల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. దీంతో జిల్లాలోని 50 శాతం భూముల్లో పంట సాగు కావటం లేదని తెలుస్తోంది. సర్కారు మాత్రం రైతు భరోసా పథకం కింద జిల్లాలో 77,984 ఎకరాల వ్యవసాయ భూములకు సంబంధించి 40,960 మందికి రైతు భరోసా పథకం వర్తింపజేస్తోంది. దీంతో గత కొన్నేళ్లుగా రైతు భరోసా(రైతు బంధు) పథకం కింద రూ.35 కోట్లు సర్కారు సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం పంట సాగు చేయని భూములకు రైతు భరోసా పథకాన్ని నిలిపి వేస్తే..50 శాతం నిధులు అంటే రూ.15 కోట్ల వరకు ఆదాకాగలదని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో వివిధ పంటలను సాగు చేస్తున్న 50 శాతం వ్యవసాయ భూములకు మాత్రమే రైతు భరోసా అందజేసే అవకాశం కనిపిస్తోంది.

పంట రుణాలను పంపిణీ చేస్తాం..

యాసంగిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంట సాగుకు అవసరమయ్యే పంట రుణాలను పంపిణీ చేస్తాం. ఈ మేరకు సంబంధిత బ్యాంకులతో కార్యాచరణ రూపొందించాం. అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను అందుబాటులో ఉంచాం. ప్రభుత్వం ఆదేశంతో రైతు భరోసా అందిస్తాం.

– చంద్రకళ, వ్యవసాయ శాఖ అధికారి, మేడ్చల్ జిల్లా

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ

కళాశాలను బలోపేతం చేస్తున్నాం

ఘట్‌కేసర్: ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ కళాశాలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకులాల సంయుక్త కార్యదర్శి శారద అన్నారు. అంకుషాపూర్‌లో ఇటీవల ప్రారంభించిన ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ మహిళా డిగ్రీ కళాశాలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..బీబీనగర్ లక్ష్మీగూడెం ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ డిగ్రీ మహిళా కళాశాల కనుమరుగైపోతుందన్నది అసత్యమన్నారు. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులతో పాటు అదనంగా మిలటరీ విద్యను వేలాది మంది విద్యార్థినులకు అందించడానికి ఘట్‌కేసర్‌కు తరలించామని పేర్కొన్నారు. మిలటరీ శిక్షణలో భాగంగా ఎన్‌డీఏ లాంటి యూపీఎస్‌సీ పోటీ పరీక్షల కోసం అర్హత సాధించిన విద్యార్థునులకు డీఐపీఆర్ సంస్థ ఆమోదించిన ఆఫీసర్ల ద్వారా సర్వీస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) పరీక్ష సన్నద్ధం కావడానికి, క్యాంపస్‌లో పూర్తి స్థాయి సామగ్రితో విశ్రాంత ఆర్మీ ఆఫీసర్లు శిక్షణ ఇస్తారన్నారు. ఇటీవల కేంద్రం ఇంటర్‌తో ఎన్‌డీఏ పరీక్ష రాయడానికి అబ్బాయిలతో పాటు అమ్మాయిలకు అవకాశం ఇచ్చిందని, ఇప్పటికే నలుగురు విద్యార్థినులు ఎస్ఎస్‌బీలో అర్హత సాధించారన్నారు. అంకుషాపూర్‌లోని బుద్వేల్, మహింద్రహిల్స్ డిగ్రీ మహిళా కళాశాల, జగద్గిరిగుట్ట విద్యార్థినులకు శిక్షణ ఇవ్వడానికి ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడీ శర్మ, ప్రిన్సిపాళ్లు స్నేహలత, రాధిక, నిరూప, అధ్యాపకుడు వెంకటేశ్వర్ రావు పాల్గొన్నారు.



ఫిట్‌నెస్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న గురుకుల్ సంయుక్త కార్యదర్శి శారద

పీఆర్‌టీయూ ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డుల పంపిణీ

కీసర: పీఆర్‌టీయూ కీసర మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులు, నూతన సంవత్సర కేలండర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ సంఘం జిల్లా కార్యదర్శి ఆనంద్, కీసర మండల అధ్యక్షుడు చీర యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఈగ శ్రీనివాస్, రాష్ట్ర బాధ్యులు జి. వెంకటేశ్వర్లు, విద్యాసాగర్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ ఎం శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జనార్ధన్, రాజ్యలక్ష్మి, ఇందిర, ప్రమిల, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.



గుర్తింపు కార్డులు అందజేస్తున్న సంఘం నేతలు

నూతన సంవత్సర వేడుకలకు పటిష్ట బందోబస్తు

కీసర: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు నిర్వహిస్తామని కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. నూతన సంవత్సర వేడుకలు జరుపుకొనే వారు జాగ్రత్తలు పాటించాలన్నారు. వేడుకల పేరుతో ప్రజా జీవనానికి భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసుకునే కార్యక్రమాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని, రాత్రి 12:30 గంటల వరకు నూతన సంవత్సర వేడుకలు పూర్తి కావాలని, తర్వాత కొనసాగిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. నిరంతర పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఉంటాయన్నారు. అత్యవసర సమయంలో స్థానిక పోలీసులకు లేదా, డయల్ 100కు ఫోన్ చేసి పోలీస్‌సేవలు ఉపయోగించుకోవాలన్నారు.



కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య

త్వరలో అండర్‌పాస్ పనులు ప్రారంభం

పోచారం: అన్నోజిగూడలోని ఎన్టీపీసీ చౌరస్తా వద్ద అండర్‌పాస్ పనులు త్వరలో ప్రారంభమవుతాయని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించేందుకు నిర్ణయించిన ప్రాంతాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడతూ..అండర్ పాస్ నిర్మించేందుకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేశామన్నారు. త్వరలో పనులు మొదలవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, కౌన్సిలర్లు గొంగళ్ల మహేష్, సింగిరెడ్డి సాయిరెడ్డి, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, నాయకులు పవన్‌రెడ్డి, ఆకిటి బాల్‌రెడ్డి, మహేష్, జితేందర్ నాయక్, సురేష్ నాయక్, నల్లవెల్లి రమేష్ ముదిరాజ్, జవాజీ అశోక్, రేతి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



అన్నోజిగూడల్ అండర్ పాస్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఐదో వార్డులో కొంత కాలంగా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదన్న స్థానికుల విన్నపం మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, స్థానిక కౌన్సిలర్ అనురాధతో కలిసి పైపులైన్ కోసం సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎదులాబాద్‌కు వెళ్లే భగీరథ లైన్ నుంచి టీ జాయింట్ తీసుకొని కేఎల్లార్ నగర్ ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లేశ్, రవీందర్, మిషన్ భగీరథ డీఈ మహేందర్, ఏఈ అభిషేక్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, జంగయ్యయాదవ్, నాగరాజ్‌ముదిరాజ్, దేవేందర్‌ముదిరాజ్, సంజీవరెడ్డి, నర్సింగ్‌రావు, సత్తిరెడ్డి, బాబు, నాగేశ్, కుమార్‌యాదవ్, అభిలాశ్‌యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

సత్యనారాయణ, మేడ్చల్ ఇన్‌స్పెక్టర్



మేడ్చల్‌రూరల్: న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఈ మేరకు పోలీసు అధికారులు అప్రమత్తమవుతున్నారు. కొత్త సంవత్సరం వేళ ఎలాంటి అలజడులకు, అవాంతరాలకు తావు లేకుండా చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు.

ఈ సూచనలు పాటించాలి..

◆ వేడుకలు నిర్వహించే ఈవెంట్స్ నిర్వాహకులు తమ ఈవెంట్స్‌కు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసులకు వివరించి అనుమతులు పొందాలి.

◆ ఈవెంట్స్, ఇతర కార్యక్రమాలకు అనుమతి తప్పనిసరి. అనుమతులు లేకుండా పార్టీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు.

◆ గ్రామాల్లో యువత చేసుకునే న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా భారీ సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసి ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దు.

◆ యువత రహదారులపై, బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు జరుపుకుంటూ వాహనదారులకు ఇతరులకు ఆటంకం కలిగించవద్దు.

◆ అర్ధరాత్రి 12.30 గంటల లోపు తమ వేడుకలను పూర్తి చేసుకుని ఇంటికి చేరుకోవాలి.

◆ యువత వేడుకల సందర్భంగా విచ్చలవిడిగా మద్యం సేవించడం, డ్రగ్స్ తీసుకోవడం చేయొద్దు.



కొత్త ఏడాదికి ఆలయాలు ముస్తాబు

కొత్త ఏడాది 2025కు ప్రముఖ ఆలయాలు ముస్తాబవుతున్నాయి. కొత్త సంవత్సరం మొదటి రోజున కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరుడు, చీర్యాల శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా దేవస్థానం చైర్మన్లు తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి, మల్లారపు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వివిధ ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. క్యూ లైన్లు, స్వామి వారి దర్శనం త్వరగా అయ్యే విధంగా ఏర్పాట్లు, లడ్డూ, పులిహోర తదితర ప్రసాదాల కొరత లేకుండా తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. – కీసర

కలెక్టరేట్‌లో 123 ఫిర్యాదులు



సాక్షి,సిటీబ్యూరో: జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలపై 123 అర్జీలను ఇన్‌చార్జి డీఆర్‌ఓ శంకర్ కుమార్‌తో కలిసి మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి స్వీకరించారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు.

యువతి అదృశ్యం



హారతి

జవహర్‌నగర్: తండ్రి మందలించడంతో కుమార్తె అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దమ్మాయిగూడ పద్మశాలి టౌన్‌షిప్‌లో నివసించే ఒర్సు రాజు కుమార్తె హారతి (19) బీకామ్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఇటీవల హారతి ఫోన్‌లో తరచూ మాట్లాడుతుండటం చూసిన రాజు ఫోన్ మందలించి చదువుపై దృష్టి పెట్టాలని సూచించాడు. ఈ నెల 30న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి రాత్రైనా రాలేదు. బంధువులు, తెలిసిన వారితో ఆరా తీయగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి

జవహర్‌నగర్: న్యూ ఇయర్ పేరిట కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాలతో జాగ్రత్తగా ఉండాలని జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆకర్షణీయమైన చిత్రాల పేరిట సందేశాలు, ఆఫర్లు, డిస్కౌంట్ అంటూ ఫోన్‌కు వచ్చే మెసేజ్‌లను క్లిక్ చేస్తే మోసపోతారన్నారు. అలా ఫోన్లకు వచ్చే లింకులపై క్లిక్ చేస్తే మీ డేటా, బ్యాంక్ ఖాతాలు చోరీకి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. పలు అపరిచిత మెసేజ్‌లు వచ్చి మోసపోతే వెంటనే 1930కి ఫోన్ చేయాలని కోరారు.

మేడ్చల్ రైల్వే స్టేషన్ రోడ్డుకు పూర్వ వైభవం

మేడ్చల్: మేడ్చల్ పుట్టుక నుంచి మేడ్చల్ పట్టణంకు ప్రధాన రోడ్డుగా ఉన్న రైల్వే స్టేషన్ రోడ్డు కొన్ని ఏళ్లుగా కళతప్పి ఉండటంతో ఇటీవలే మున్సిపల్ తీసుకున్న నిర్ణయాలతో గత వైభవం సంతరించుకుంది. మేడ్చల్ పట్టణంలో జాతీయ రహదారిపై ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి రైల్వే స్టేషన్ వరకు దాదాపు రెండు కిల్లో మీటర్ల రోడ్డు ఉంది. ఈ రోడ్డులోనే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన మార్కెట్, రైతు బజారు, ఆసుపత్రి, రైల్వే స్టేషన్ రోడ్డు వంటివి అన్ని ఉన్నా కొన్ని ఏళ్లుగా రోడ్డులో వ్యాపారాలు లేక బోసిపోయెది. మున్సిపల్ అధికారులు గత నెలలో వివేకానంద విగ్రహం నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు రోడ్డు వెడల్పు చేసి ఆక్రమణలు తొలగించడంతో రోడ్లపై వ్యాపారాలన్ని రైల్వే స్టేషన్ రోడ్డుకు చేరాయి. రైల్వే స్టేషన్ రోడ్డు గతంలో వెడల్పు చేసిన రోడ్డు మధ్యలో డివైడర్ ఉండి విశాలంగా ఉన్న రోడ్డు కావడంతో రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు ఏర్పాటు అయ్యాయి. ప్రధానంగా పూలు, పండ్లు, ఇతర చిరు వ్యాపారాలతో మేడ్చల్ పాత రోడ్డు ప్రస్తుతం కళకళలాడుతోంది. దీంతో మేడ్చల్ పాత రోడ్లు వ్యాపార కళను సంతరించుకుని పూర్వ వైభవంను సాధించే దిశలో కనిపిస్తున్నాయి.



వ్యాపారాలతో రైల్వే స్టేషన్ రోడ్డు

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళన

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖకు చెందిన సమగ్ర శిక్షా ఉద్యోగులు, సిబ్బంది మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు 21వ రోజుకు చేరుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని దీక్షా శిబిరంలో పెట్టి సమగ్ర శిక్ష ఉద్యోగులంతా భజన చేశారు. ఈ సందర్భంగా సీఎం తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించగలరన్న ధీమాతో పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న సమగ్ర శిక్షా సిబ్బంది 21 రోజులుగా విధులకు గైహాజరవుతున్నారు. విద్యాశాఖలో జిల్లా స్థాయిలో ఏపీవోలు, డీపీవోలు, సాంకేతిక నిపుణులు పని చేస్తుండగా, మండల స్థాయిలో కంప్యూటర్ సహాయకులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవలను అందించే భవిత కేంద్రాల్లో ఉపాధ్యాయులు, రీసోర్సు పర్సన్లు పని చేస్తున్నారు. పాఠశాల స్థాయిలో ఆర్ట్, క్రాఫ్ట్, కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు, ఏఎన్ఎంలు, పీఈటీలు, అకౌంటెంట్లు, కంప్యూటర్ సహాయకులు, వంట పనివారు. వాచ్‌మెన్లు, స్వీపర్లు, స్కావెంజర్లు పనిచేస్తున్నారు. వీరంతా 21 రోజులుగా సమ్మెలోకి వెళ్లటంతో విద్యాశాఖపై తీవ్ర ప్రభావం పడుతోంది. సమగ్ర శిక్షా ఉద్యోగులందరిని క్రమబద్ధీకరించాలని, పే స్కేల్ కల్పించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా నేతలు జగదీశ్వర్, ఫణి తదితరులు పాల్గొన్నారు.



చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మేడ్చల్‌రూరల్: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అశోక్ వివరాల ప్రకారం.. మునీరాబాద్ గ్రామ పరిధిలో ఈ నెల 26న 30–35 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడిగా మధుసూదన్

సాక్షి,సిటీబ్యూరో: ట్రస్మా రాష్ట్ర శాఖ అధ్యక్షుడుగా అంబర్‌పేట ప్రగతి విద్యానికేతన్ హైస్కూల్ చైర్మన్ సాధుల మధుసూదన్ భారీ మెజార్టీతో ఎన్నికయ్యారు. సాదుల మధుసూదన్‌కు 2220 ఓట్లు రాగా, ఆయన సమీప అభ్యర్థి ప్రకాష్ బాబుకు 91 ఓట్లు మాత్రమే వచ్చాయి. 2129 ఓట్ల భారీ మెజార్టీతో ఆయన ఎన్నికైనట్లు తెలంగాణ ట్రస్మా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎన్నికల కమిషన్ చైర్మన్ నర్రా నారాయణరెడ్డి ప్రకటించారు. ట్రస్మా రాష్ట్ర పధాన కార్యదర్శిగా ఎస్. రమేష్‌రావుకు 2217 ఓట్లు రాగా తన సమీప ప్రత్యర్థి కే.వీరన్నకు 94 ఓట్లు పోలయ్యాయి. కోశాధికారిగా పి. రాఘవేంద్రరెడ్డి 2193 ఓట్లు నమోదు కాగా సమీప ప్రత్యర్థి ఆర్. విష్ణువర్ధన్‌రావుకు 118 ఓట్లు పోలయ్యాయి. పి రాఘవేంద్రరెడ్డి 2075 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

డిజిటల్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు..

దేశంలోనే మొట్టమొదటిసారిగా డిజిటల్ బ్యాలెట్ పద్ధతిన ఎన్నికలు నిర్వహించినట్లు ఎన్నికల అధికారి నారాయణరెడ్డి తెలిపారు. తెలంగాణలోని 33 జిల్లాల నుంచి ప్రతి ఓటరుకు ప్రతి జిల్లాలో ఆన్‌లైన్‌లో ఓటింగ్‌కు అవకాశం లభించిందని పేర్కొన్నారు. అందరి సభ్యుల అభిప్రాయ సేకరణ తీసుకొని ఈ ఆన్‌లైన్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించామన్నారు. ఈ పద్ధతిలో ఎన్నికలు తొలిసారిగా నిర్వహించినప్పటికీ 53.1 ఓటింగ్ జరిగిందన్నారు. సంగారెడ్డి, ములుగు, మహబూబాబాద్, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి, జిల్లాలో 95 నుంచి 98 శాతం, జోగులాంబ, సిరిసిల్ల, నారాయణపేట, మంచిర్యాల జిల్లాలో 20 శాతానికి పైగా ఓటింగ్ నమోదైందన్నారు. ట్రస్మాలో మొత్తంగా 4353 ఓట్లు ఉండగా, 2311 ఓట్లు పోలయ్యాయన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన ట్రస్మా నూతన కమిటీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారికి ఎన్నికల అధికారి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

